BHARATH SAMACHAR DIGITAL

15, నవంబర్ 2026, ఆదివారం భారత్ సమాచార్

ఘనంగా భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు





భారత్ సమాచార్, సిద్దిపేట జిల్లా: హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహంలో భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హాస్టల్ సంక్షేమ అధికారి విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని బిర్సా ముండా సేవలను స్మరించుకున్నారు.

భారత ప్రభుత్వం నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న బిర్సా ముండా జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. గిరిజన విద్యార్థులకు తమ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, వారసత్వంపై అవగాహన కల్పించడంతో పాటు, గిరిజన సమాజానికి భగవాన్ బిర్సా ముండా చేసిన సేవలు, ఆయన పోరాట స్ఫూర్తిని తెలియజేయడమే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థుల కోసం క్విజ్, సంప్రదాయ గిరిజన నృత్యం, వ్యాసరచన, ప్రసంగ పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా గిరిజన సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అంతేకాకుండా విద్యార్థులు భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉపయోగపడే పుస్తకాలను కూడా అందించారు.

గిరిజన విద్యార్థుల్లో తమ మూలాలు, సంస్కృతి, చరిత్ర పట్ల గౌరవం పెంపొందించడంతో పాటు, భగవాన్ బిర్సా ముండా ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు పరిచయం చేయడమే ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహనతో పాటు ఆత్మవిశ్వాసం, ప్రతిభను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.